క్లుప్తంగా

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: మండలంలోని సంపర ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి కార్తిక మాసం శని త్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి దళం పూజలు, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థుల ర్యాలీ



గోకవరంలో ర్యాలీ చేస్తున్న ఫార్మసీ విద్యార్థులు

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా శనివారం గోకవరంలో ఫార్మసీ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల చైర్మన్ పి.కనకరాజు ప్రారంభించారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ పి.నాగమణి, ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్ రావు, వైస్ ప్రిన్సిపల్ సుజిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయానికి శంకుస్థాపన



పందలపాకలో రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో దాతల సహకారంతో పునర్నిర్మిస్తున్న రెడ్ల రామాలయానికి మాజీ సర్పంచ్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, కరుణావతి దంపతులు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలోని గ్రామస్తులు, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాంబశివుడి ఊరేగింపు



పెదపూడిలో నిర్వహిస్తున్న సాంబశివుడి ఊరేగింపు

పెదపూడి: పెదపూడిలో ప్రసిద్ధి చెందిన గౌరీదేవి అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి సాంబశివుడి ఊరేగింపు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత వరి దుబ్బును, అనంతరం సాంబశివుడిని వినాయకుడి గుడి వీధి, మార్కెట్, సంఘం సెంటర్, వెలంపేట, కావమ్మ కొత్తపేట మీదుగా గ్రామంలో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తంగేళ్లరాజు, మీసాల నాగరాజు, బురిడి సతీష్, ఇమ్మంది సురేష్, మేలేటి ధనరాజు, ఇందన గంగాధర్, పప్పు జాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గౌరీదేవి అమ్మవారి సంబరం



అమ్మవారిని దర్శించిన జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: మండలంలోని వంగలపూడి పంచాయతీ పరిధిలోగల చినవంగలపూడిలో శ్రీగౌరీదేవి అమ్మవారి సంబరం వైభవంగా నిర్వహించారు. ఆదివారం చినవంగలపూడిలో జరిగిన శ్రీ గౌరిదేవి అమ్మవారి సంబరంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో మంచి నడవడికతో కూడిన భక్తిభావం కలుగుతుందని అన్నారు. రెండేళ్లకు ఒకసారి శ్రీ గౌరిదేవి సంబరం నిర్వహిస్తామని, రాత్రి గ్రామంలో అమ్మవారిని ఊరేగించిన అనంతరం తెల్లవారుజామున గోదావరిలో నిమజ్జనం చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

శనగ సాగులో రైతులు బిజీ బిజీ

- రైతులకు దన్నుగా ప్రభుత్వం
- 50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ





పొలంలో ట్రాక్టర్ సహాయంతో శనగ విత్తనాలు నాటుతున్న రైతులు, శనగ విత్తనాలను ట్రాక్టర్‌కు అమర్చిన యంత్రంలో వేస్తున్న రైతు

రంగంపేట: మెట్ట ప్రాంతమైన రంగంపేట మండలంలోని నల్లరేగడి నేలల్లో శనగ సాగులో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. శనగల ధర ఆశాజనకంగా ఉండటంతో మండల రైతులు ఈ పంటను అధికంగా సాగుచేస్తున్నారు. మండలంలోని వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో సుమారు 15 వందల ఎకరాల విస్తీర్ణంలో రబీలో ఆరుతడి పంటగా రైతులు శనగ సాగు చేపట్టారు. చలికాలంలో వేసే శనగ సాగుకి ఒకటి, రెండు నీటి తడులు సరిపోతాయి. నల్లరేగడి నేలల్లో శనగ సాగు అధిక దిగుబడి వస్తుండటంతో కౌలు రైతులు కూడా ఈ పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి నేలల్లో సాగు చేసిన వరి, మినుము ఒబ్బిడి చేసుకున్న రైతులు ప్రస్తుతం శనగ సాగులో తలమునలయ్యారు. కొందరు రైతులైతే వేసిన పత్తి పంటను సైతం దున్నేసి దాని స్థానలో శనగ సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ పంటను ఒబ్బిడి చేసుకున్న అనంతరం శనగ సాగు చేయడానికి రైతులు ముందుగా పొలాన్ని ట్రాక్టర్లతో దుక్కిలు దున్ని నీటి తడులు పెడుతున్నారు. కొంతమంది రైతులు బోరు నీటిలో తడులు పెడుతుండగా బోర్లు లేని రైతులు పుష్కర కాలువ ద్వారా వస్తున్న నీటిని ఇంజన్లతో తోడుకుని పొలాలకు మళ్లిస్తున్నారు. పదును ఆరిన తరువాత ట్రాక్టర్లతో పొలాన్ని చదును చేసి ట్రాక్టర్ల సాయంతో విత్తనాలను నాటుతున్నారు. ప్రస్తుతం చంద్రేడు, పెదరాయవరం, రంగంపేట, వడిశలేరు గ్రామాల్లో రైతులంతా ఈ పనుల్లో బిజీగా ఉన్నారు.

రాయితీలు కల్పిస్తున్న ప్రభుత్వం

అన్నదాతలకు అండదండగా నిలస్తున్న ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా కొనుగోలు కేంద్రాన్ని కూడా అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా శనగ పంటకు క్వింటాకు రూ.5,300 మద్దతు ధరను ప్రకటించింది. స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనగ విత్తనాలను 40 శాతం రాయితీపై రైతులకు అందించారు. 25 కేజీల శనగ విత్తనాల ప్యాకెట్ ధర రూ.1500 కాగా రాయితీపై రూ.775కే ఇచ్చారు. మండలంలో సుమారు 80 టన్నుల శనగ విత్తనాలను రైతులకు అందించారు. ఎకరం విస్తీర్ణంలో శనగ సాగుకు సుమారు రూ.8 వేలు ఖర్చవుతుంది. రంగంపేట మండలంలో గతేడాది సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో శనగ సాగు చేయగా, ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ ఏడాది సుమారు 1500 ఎకరాలకు సాగు పెరిగింది. ఈ ఏడాది అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి...



శనగ పంట సాగు చేసే రైతులు పొలాన్ని దుక్కి దున్నేటప్పుడే లద్దె పురుగు ఆశించకుండా నివారణా చర్యలు చేపట్టాలి. దుక్కిలోనే ఒక లీటర్ నీటిలో 200 మిల్లీ గ్రాముల క్లోరిసైరికాస్ మందును కలిపి పిచికారీ చేయాలి. మొక్కలు ఎదిగే దశలో వేర్లకు కుళ్లి తెగులు ఆశిస్తుంది. నివారణకు టిక్లో బెలలాక్స్ ఫైడర్ మందును మొక్కలపై చల్లాలి.

– కూరాకుల శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

అవ్వా.. మీకు పింఛన్ వస్తోందా?

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కానవరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: 'తాత గారూ.. బాగున్నారా.. ఆరోగ్యం ఎలా వుంది?, .. అవ్వా మీకు పింఛను వస్తోందా, ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా? అంటూ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆత్మీయంగా పలకరించారు. కానవరంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు తెలుసుకుంటూ, నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ఏమేరకు ప్రయోజనం చేకూర్చాయి, సక్రమంగా అందాయా, లేదా అని ఆరా తీశారు. తొలుత గ్రామదేవత దోర్లమ్మ వారిని దర్శించుకుని, పూజలు చేశారు.

రూ.4.55 కోట్లతో గ్రామాభివృద్ధి

నాలుగున్నరేళ్లలో రూ.4.55 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో కేవలం రూ.56 లక్షలు మాత్రమే అభివృద్ధికి వెచ్చించారన్నారు. గ్రామాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలోనే ప్రజల ముంగిటకు వచ్చేవారని, అయితే జగనన్న పాలనలో పాలకులు కూడా నిత్యం ప్రజలతో మమేకమవుతున్నారన్నారు. ప్రజల ముంగిటకే వచ్చి వారి సమస్యలు తెలుసుకుని మరీ పరిష్కారానికి కృషి చేసేలా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హతనే ప్రామాణికంగా తీసుకుని, పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో అర్హులై నివాస స్థలాలు పొందవలసిన వారుంటే వారికి కూడా త్వరలోనే పట్టాలు అందజేస్తామన్నారు. బీసీ ఏరియాలో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సత్వరమే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల బాగోగులు తెలుసుకుంటూ, ఏమి కావాలో ముందుగానే గ్రహించి, అడగకుండానే అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మీరంతా ఓటు చేసి, మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కోడి రాఘవ, సంపత్‌నగరం సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ, కానవరం పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీరామకృష్ణ, నాయకులు వాడ్రేవు శరభరాజు, ఎస్. వెంకటేశ్వరావు, టి. రాజబాబు, సంగీత సత్యబాబు, సత్తిబాబు, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధన

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో శనివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారి చెంత సుమారు 67 సంవత్సరాల క్రితం దంగేటి వెంకటరత్నం కుటుంబ సభ్యులు సత్రం నిర్మించారు. ఈ సత్రం వద్ద ఏటా కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం వారి కుటుంబ సభ్యులు కార్తిక వనసమారాధన నిర్వహించారు. గోకవరం, రంపయర్రంపాలెం, పెంటపల్లి, అచ్యుతాపురం, వీరలంకపల్లి, బావాజీపేట, వెదురుపాక తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

పందలపాకలో..

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో స్థానిక సాయిబాబా ఆలయం వద్ద కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరానికి చెందిన రెడ్డి వెంకట చిన్నారావు, రేణుకాదేవి దంపతులు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రొంగల దుర్గాప్రసాద్, పంచాయతీ వార్డు సభ్యులు పడాల దుర్గాప్రసాద్‌రెడ్డి, ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంశ పారంపర్యంగా అనుభవించడానికే పట్టాలు



పట్టా అందిస్తున్న సర్పంచ్ ముత్యాలు, ఆర్బీకే చైర్మన్ వెంకట్రాజు

సీతానగరం: లంక భూములను వంశ పారంపర్యంగా అనుభవించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టాలను అందించిందని మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ కోంద్రపు ముత్యాలు అన్నారు. శనివారం సీతానగరం గ్రామ సచివాలయం–1లో లంక భూముల పట్టాలను 114 మంది రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసే లంక భూములకు ఇంత వరకు ఏ ప్రభుత్వం పట్టాలు అందించలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్టాలు అందించిందన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు, పరిహారాలకు అర్హులను చేసిందన్నారు. పూర్తి హక్కులతో కూడిన పట్టాలను అందించిందని, సొంత భూమి కలిగిన రైతులు పొందే అన్ని సదుపాయాలు పొందుతారన్నారు. అయితే ఈ భూములను అమ్ముకోకూడదన్నారు. బీ క్లాస్ భూమిలో 104 మందికి, సీ క్లాస్ భూమిలో 10 మంది రైతులకు లంకభూముల పట్టాలుగా అందించామని వారు తెలిపారు. వంగలపూడికి చెందిన 36 మంది, రఘుదేవపురానికి చెందిన 50 మంది, సీతానగరానికి చెందిన 10 మంది ముస్లింలకు, కోర్టు ద్వారా పురుషోత్తపట్నం, రఘుదేవపురానికి చెందిన 12 మంది రైతులకు 31.78 ఎకరాలకు పట్టాలు అందించామని వీఆర్వో అఖిల్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

నిస్వార్థ ప్రజా సేవకుడు సూర్యబ్రహ్మానందరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



సూర్యబ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సత్తి సూర్యబ్రహ్మానందరెడ్డి కుతుకులూరు సర్పంచ్‌గా నిత్యం ప్రజలతో మమేకమై, గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన నిస్వార్థ ప్రజా సేవకుడని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. కుతుకులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కుతుకులూరు మాజీ సర్పంచ్, ఎస్ఆర్ఎంటీ మాజీ డైరెక్టర్ సూర్యబ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యబ్రహ్మానందరెడ్డి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమానికి మంచి చేసే విషయంలో విమర్శలను పట్టించుకునేవారు కాదన్నారు. గ్రామంలో ప్రభుత్వాసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణానికి ఆయన తన వంతు కృషిచేశారని చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన తనకు సూర్యబ్రహ్మానందరెడ్డి అండగా నిలిచారని ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్షనాయకుడు సత్తి రామారెడ్డి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పెదపర్తి సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో వజ్రాయుధం ఓటు



రంగంపేటలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



జి.మామిడాడలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుభాష్

పెదపూడి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ టి.సుభాష్ తెలిపారు. జి.మామిడాడలో గమ్యం, డీఆర్‌కేరెడ్డి జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు ఓటు హక్కు నమోదు, వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం డిసెంబర్ 9వ తేదీ వరకూ అవకాశం కల్పించిందన్నారు. ఓటరు లిస్టులో పేర్లు సరిచేసుకోడానికి, మార్పులు, చేర్పులు ఉన్నట్లయితే సంబంధిత శాఖాధికారులను సంప్రదించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 27 నుంచి ఓటరు జాబితా తయారు చేసి వచ్చే ఏడాది జనవరి 5వ తేదీలోగా పూర్తి ఓటరు లిస్టును రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పి.శ్రీనివాసరెడ్డి, ఎస్.దొరబాబు, ఆర్ఐ ఎం.త్రివేణి, వీఆర్వోలు కె.శ్రీనివాసరావు, పద్మావతి, చుక్కా ఇందిరా ప్రియ, లింగం రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ నేదూరి దొరకయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఓటర్లను చైతన్య పరచడం, భాగస్వామ్యం చేయడం అనే అంశంపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఓటు హక్కును వజ్రాయుధంగా ఉపయోగించి మంచి పరిపాలన అందించే నేతలను ఎన్నుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం అందజేస్తున్న వివిధ సేవలు, స్మార్ట్‌ఫోన్ యాప్‌ల ద్వారా సులభతరంగా ఓటు పొందే విధానం గురించి వివరించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ముగిసిన వేద 2023 సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వేద సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ దత్తు

రాజానగరం: పరిశోధనాభివృద్ధికి, ప్రాజెక్టులు ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తున్నామని, ఇందుకు అవసరమైన నిధులు ఉన్నాయని వేద సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.దత్తు అన్నారు. విద్యార్థులు పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచుకుంటే నూతనావిష్కరణలకు అవకాశం ఉంటుందన్నారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బెంగళూరులోని వేధ సొసైటీ సహకారంతో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ వాక్యూమ్ ఎలక్ట్రానిక్ డివైసెస్ అండ్ అప్లికేషన్స్' అనే అంశం పై మూడు రోజులుగా జరుగుతున్న వేధ 2023 జాతీయ సదస్సు శనివారం ముగిసింది. బెనారస్ యూనివర్సిటీ రిటైర్డ్ ఆచార్యులు బీఎస్ బసు, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ఎన్ జోషి, డాక్టర్ పీకే శర్మ, డాక్టర్ డీసీ పాండే, డాక్టర్ ఎల్ఎం జోషి ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎస్ శర్మ, డైరెక్టర్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్ఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎన్. లీలావతి, డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వేధ కన్వీనర్ పి.వెంకట్రావు, కో కన్వీనర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

27 ఏళ్లకు కలుసుకున్న పూర్వ విద్యార్థులు



పుష్కర వనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

రాజానగరం: ఆత్మీయతతో కూడిన పలకరింపులు, అనుబంధాలను పంచే పరిచయాలు, చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ వారు రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదవ తరగతి చదివిన విద్యార్థులంతా లాలాచెరువులోని మహాపుష్కరవనంలో శనివారం సమావేశమయ్యారు. 27ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందానుభూతులను పొందారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాల గురించి పరస్పరం తెలుసుకుంటూ ఎవరు ఏస్థాయిలోని వారైనాగాని అంతా ఒక్కటిగానే రోజంతా ఆనందంగా గడిపేశారు. ఆడుతూ, పాడుతూ తమ పిల్లల ముంగిటనే పిల్లల్లా గంతులేశారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు మణి, సూర్యనారాయణ, పాల్, ప్రకాష్ బాబు, ఝాన్సీ, ప్రతిభకుమారి, పద్మావతి, రాజరాజేశ్వరి, రోజాలను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మధురపూడి: రెండు కార్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన కోరుకొండ మండలం ఎయిర్ పోర్టు సమీపంలో శనివారం జరిగింది. కోరుకొండ పోలీసుల కథనం ప్రకారం కృష్ణాజిల్లా గణపవరానికి చెందిన తన్నీరు వెంకన్న తన కూతురు సుధారాణికి వికాస్ ఫార్మసీ కాలేజీలో బి ఫార్మసీ అడ్మిషన్ నిమిత్తం కారులో బయలు దేరారు. కుమారుడు తన్నీరు మోహనరావు, వియ్యంకుడు సత్యనారాయణ వారితోపాటు కారులో ఉన్నారు. వికాస్ కాలేజీ టర్నింగులో మరో కారు వచ్చి ఢీ కొట్టింది. దీంతో మోహనరావు, సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి, వీరు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వెంకన్న, సుధారాణిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఢీ కొట్టిన కారు కాకినాడకు చెందినది. కారులోని సేఫ్టీ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులోని వారికి గాయాలు కాలేదు.

గురువులు నిరంతర విద్యార్థులు

రాజానగరం: విజ్ఞాన సముపార్జనలో గురువులు నిరంతరం విద్యార్థులుగా సాధన చేయాలని, అప్పుడే ఆధునిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించగలుగుతారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. విద్యార్థులకు నాణ్యమైన, నైపుణ్యాలతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్స్ అధ్యాపకులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. వాధ్వాని ఫౌండేషన్ సహకారంతో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హాయర్ ఎడ్యుకేషన్, 'నన్నయ' వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో 32 మంది ఇంగ్లిష్ ఫ్యాకల్టీస్ పాల్గొన్నారు. ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. జగన్‌మోహన్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ పి.స్వాతి పర్యవేక్షణలో ఈ ప్రోగ్రామ్ జరిగింది.

డ్రిప్ ఇరిగేషన్‌తో ఆదా

మధురపూడి: ఉద్యాన వనాల విస్తరణలో భాగంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువులు, వ్యవసాయ కూలీల ఖర్చులో 40 శాతం ఆదా చేసుకోవచ్చని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి బి.సుజాతకుమారి అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో పెద్దాపురానికి చెందిన రుచిసోయ ఇండ స్ట్రీస్ ఆధ్వర్యంలో ఉద్యాన రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఉద్యాన శాఖ, పతంజలి ఆయిల్ పామ్ కంపెనీల సంయుక్తంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సుజాత కుమారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగులో యాజమాన్య పద్ధతులను అవలంబించాలన్నారు. అంతర పంటల సాగును నిర్వహించవచ్చన్నారు. తద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చన్నారు. వ్యవసాయ కూలీ రేట్లు అధికంగా ఉన్న కారణంగా ఉద్యాన రైతులు పలు జాగ్రత్తలను పాటించలేకపోతున్నారన్నారు. ఉద్యాన శాఖ మండల అధికారి పి.రినీ, పతంజలి డీజీఎం ప్రకాశ్ పాల్గొన్నారు.

ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి

సీతానగరం: రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డు విస్తరణ పనులలో సూచన బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. శనివారం వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోగల రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడం వల్ల ముగ్గురు చనిపోయారని ఆరోపించారు.

462 మందికి వైద్య సేవలు



చినకొండేపూడిలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడిలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు 462 మందికి వైద్య సేవలు అందించారు. శనివారం చినకొండేపూడి సచివాలయం – 1 పరిధిలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో అవసరమైన పరీక్షలను చేసి, ఉచితంగా మందులను అందించారు. మంచంపై ఉన్న రోగుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యసేవలు అందించారు. ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ సత్తిపండు రాజు, వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణరాజు, యర్రంశెట్టి బాబులు, పీహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ దుర్గ, ఏఎన్ఎం విశాలాక్షి, ఆశా వర్కర్లు రాణి, కుమారి, నాగమణి పాల్గొన్నారు.

షష్ఠి పనులకు రాట ముహూర్తం




బిక్కవోలులో రాట ముహూర్తం చేస్తున్న నాయకులు

బిక్కవోలు: రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన బిక్కవోలు షష్ఠి ఉత్సవ పనులకు రాట ముహూర్తం శనివారం నిర్వహించారు. ఆలయం వద్ద ఉపసర్పంచ్ డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వచ్చే నెల 18 తేదీన షష్ఠి వేడుకలు నిర్వహించడానికి ఘనంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలోని బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గువ్వల సత్తిరెడ్డి, పోతల ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవలు విస్తృతం కావాలి

మధురపూడి: ప్రజా పంపిణీ వ్యవస్థ సేవలు విస్తృతం కావాలని కోరుకొండ తహసీల్దార్ పాపారావు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ లంక సునీత అధ్యక్షతన విజిలెన్స్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ పాపారావు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో వాహనాల ద్వారా రేషన్‌ను లబ్ధిదారుల ఇంటికి సరిగా చేర్చడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంఈఓ కుశలవ దొర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ పాల్గొన్నారు.



కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విజిలెన్స్ కమిటీ సమావేశం